
సాక్షి పల్నాడు

ఆదివారం । 31 । మార్చి । 2024



'రుక్మిణీ హరణం'లో స్వామి దర్శనం

మంగళగిరి : నగరంలోని లక్ష్మీనృసింహస్వామి శనివారం రుక్మిణీహరణం అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు.



సాగర్ నీటి మట్టం

విజయపురిసౌత్: సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 513.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (ఆది)	సహరి (సోమ)
నరసరావుపేట	6.28	4.48
గుంటూరు	6.26	4.46
బాపట్ల	6.26	4.46

న్యూస్‌రీల్

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



సత్తెనపల్లి: నందిగామలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ 30వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీ సీతారామాంజనేయ భజన సమాజం సంకీర్తన చేపట్టింది. అనంతరం వార్షిక మహా కళ్యాణ మహోత్సవాన్ని దేవాలయ అర్చకుడు, కార్యదర్శి మోతె పురుషోత్తమశర్మ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో మహోత్సవాన్ని వీక్షించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం స్వామి నగరోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

కోటేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ



సత్తెనపల్లి: పట్టణంలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయం వెనుక అమ్మిశెట్టి వారి వీధిలో గల కోటేశ్వర స్వామి దేవాలయం (పాత శివాలయం) జీర్ణోద్ధరణ పనులు శనివారం నిర్వహించారు. లలితా పీఠాధిపతులు మేళ్లచెరువు సుబ్రహ్మణ్యశర్మ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు భవిరిశెట్టి యశ్వంత్ కుమార్, జయలక్ష్మి, భవిరిశెట్టి రూప్‌చరణగుప్త, శిరీషరాణి, భక్తులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం రూ.50.97 లక్షలు



మంగళగిరి: నగరంలో వేంచేసిఉన్న లక్ష్మీనృసింహస్వామి మూడు నెలల హుండీ ఆదాయం రూ.50,97,560 సమకూరినట్లు ఆలయ ఈఓ ఏ రామకోటిరెడ్డి తెలిపారు. ఆలయ దిగువ సన్నిధి ఆలయ ముఖ మండపంలో శనివారం స్వామి వారి ఎగువ, దిగువ సన్నిధుల హుండీలతోపాటు ఘాట్ రోడ్డుపై వేంచేసి ఉన్న పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీలను లెక్కించారు. ఎగువ సన్నిధిలో రూ.22,64,753, దిగువ సన్నిధిలో రూ.27,34,753, వేంకటేశ్వరస్వామి ఆలయం రూ.62,211, అన్నదానం కోసం రూ.36,098 ఆదాయం చేకూరినట్లు తెలిపారు. గత మూడు నెలల కంటే రూ.9,49,179 అధికంగా ఆదాయం సమకూరిందని తెలిపారు. హుండీ లెక్కింపును సీతానగరం గ్రూపు దేవాలయాల ఈఓ బి.శివారెడ్డి పర్యవేక్షించారు.

సాగర్‌ను సందర్శించిన దమ్మా ఫౌండేషన్ సీఈఓ



విజయపురిసౌత్: అంతర్జాతీయ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్‌ను శనివారం యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా దమ్మా ఫౌండేషన్ వ్యవస్థాపకులు, సీఈఓ శ్రీలంక బౌద్ధ గురువు నివిటి గాల బంతే ఆధ్వర్యంలో శ్రీలంకకు చెందిన సుగత కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మహా లడువే నంద రతన బంతే సందర్శించారు. నాగార్జునసాగర్‌లోని బుద్ధ వనాన్ని సందర్శించిన వీరు బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి, వందన సమర్పించిన అనంతరం మహా స్తూపం అంతర్భాగంలోని ధ్యాన మందిరంలో శ్రీలంక బౌద్ధ సంప్రదాయ పద్ధతుల్లో పూజలు చేశారు. అనంతరం వీరు నాగార్జునకొండ మ్యూజియాన్ని సందర్శించి అక్కడ భద్రపరిచిన బుద్ధ ధాతువు వీక్షించి ప్రార్థనలు చేశారు. అనంతరం పునర్నిర్మిత బౌద్ధ కట్టడాలైన సింహ విహారం, మహా స్తూపం, స్వస్తిక్ స్తూపం, అశ్వమేధ యాగశాలను సందర్శించారు. వీరి వెంట సికింద్రాబాద్ ఆనంద బుద్ధ విహార సంఘ పాల బంతే, ఏలే నాగన్న, నాగార్జునకొండ మ్యూజియం క్యూరేటర్ కమలహాసన్, స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

గెలిచేది.. నిలిచేది వైఎస్సార్ సీపీనే..

- రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి
- అద్భుతమైన మేనిఫెస్టోతో ఎన్నికలకు రెడీ
- చిలకలూరిపేటలో వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అయోధ్యరామిరెడ్డి. వేదికపై ఎంపీ అభ్యర్థి అనిల్ యాదవ్, అసెంబ్లీ అభ్యర్థి కావటి మనోహర్ నాయుడు, ఎమ్మెల్సీలు అప్పిరెడ్డి, మర్రి రాజశేఖర్ తదితరులు

చిలకలూరిపేట: ప్రజలకు పూర్తి మేలు చేసే అద్భుతమైన మేనిఫెస్టోతో ఎన్నికలకు వెళుతున్నామని.. రాష్ట్రంలో గెలిచేది, నిలిచేది వైఎస్సార్ సీపీనేనని పార్టీ రీజినల్ కో- ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం పట్టణంలోని ఎస్ఎంఎస్ గార్డెన్స్ ముస్లిం షాదీఖానాలో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. నియోజకవర్గ నలుమూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆళ్ల అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసి చూపారని చెప్పారు. దీంతో రాష్ట్రంలో ప్రతి ఇంటికీ మేలు జరిగిందని చెప్పారు. ఈ నేపథ్యంలో ఓటు అడిగే హక్కు, అధికారం మనకుందని తెలిపారు. రాజకీయ అనుభవం ఉన్న ఇద్దరు నాయకులు అనిల్‌కుమార్ యాదవ్, కావటి మనోహర్‌నాయుడు పోటీ చేస్తున్నారని, వీరి వల్ల నియోజకవర్గానికి, ప్రజలకు కచ్చితంగా మేలు జరుగుతుందని వెల్లడించారు.

ఇద్దరి గెలుపే లక్ష్యం

పార్టీ కృష్ణా, ఎన్‌టీఆర్ జిల్లాల రీజినల్ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ కార్యకర్తల కష్టాలు తెలిసిన ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్ నాయుడును గెలిపించుకోవడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపు నిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో దేశంలో ఎక్కడా లేని విధంగా ఆదర్శపాలన కొనసాగుతున్నదని వివరించారు.

వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేద్దాం

నరసరావుపేట లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ పి. అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేద్దామని, మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామని పిలుపు నిచ్చారు. ఏ అవకాశాలను జారవిడుచుకోకుండా సైనికుల్లా పనిచేస్తే విజయం మనదేనని పేర్కొన్నారు. పార్టీ శాశ్వతమని, కార్యకర్తలే అసలైన నాయకులని వెల్లడించారు. పార్టీ తిరిగి అధికారంలోకి వస్తే పనుల కోసం కార్యకర్తలు రావాల్సిన అవసరం లేదని, కష్టపడ్డవారిని వెతికివెతికి సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. నూటికి నూరు శాతం తిరిగి జగన్ సీఎం కావడం ఖాయమని, ఆయన కోసం పనిచేస్తున్నామని భావించి ఎన్నికలకు సిద్ధం కావాలని కోరారు.

మాటల గారడీ నమ్మవద్దు

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్ మాట్లాడుతూ ఎన్నికలు వస్తే టీడీపీ అధినేత చంద్రబాబు మాటల గారడీ చేస్తాడని... ఆశపెట్టే అబద్దాలు అద్భుతంగా చెబుతాడన్నారు. ఆయన మాటల గారడీ ఎవరూ నమ్మవద్దని ప్రజలకు సూచించారు. జగన్ తిరిగి సీఎం అయితేనే పేదల జీవితాలు బాగుపడతాయన్న విషయం గుర్తుంచుకోవాలని చెప్పారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు చిట్టా విజయ భాస్కరరెడ్డి, గుంటూరు నగర డెప్యూటీ మేయర్ డైమండ్‌బాబు, రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు చిల్లపల్లి మోహన్‌రావు, మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గాదె సుజాత, ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ అనూష, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గొంటు శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, ఎంపీపీలు దేవినేని శంకరరావు, తలతోటి రాణి, పిడతల రూనీ, జెడ్పీటీసీ సభ్యులు కోడె సుధారాణి, కాట్రగడ్డ మస్తాన్‌రావు, పార్టీ పట్టణ అధ్యక్షులు పఠాన్ తలహాఖాన్, విడదల కమలేంద్ర, మండలాల అధ్యక్షులు గుత్తా యామలయ్య, ఘంటా శంకరరావు, మద్దూరి కోటిరెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు సోమేపల్లి వెంకట సుబ్బయ్య, పార్టీ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

మనమే పోటీ చేస్తున్నాం అనుకోవాలి



ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ ప్రతి నాయకుడు, కార్యకర్త ఎన్నికల్లో మనమే పోటీ చేస్తున్నాం అనే భావనతో పనిచేస్తే విజయం నల్లేరు మీద నడక వంటిదని తెలిపారు. తిరిగి ముఖ్యమంత్రిగా వైఎస్. జగన్‌ను చేసుకోవాలంటే ఇక్కడ కావటి మనోహర్‌నాయుడును గెలిపించాలని, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్‌కు అత్యధిక మెజార్టీ తీసుకురావాలని పిలుపు నిచ్చారు.

జగనన్న మాట.. మనోహర్ బాట



నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు మాట్లాడుతూ తాను జగనన్న సైనికుడని... జగనన్న మాటే మనోహర్ బాటని పేర్కొన్నారు. ఇటీవల సీఎం వైఎస్. జగన్ పిలిచి చిలకలూరిపేటలో పోటీ చేయాలని ఆదేశించారని, ఆయన మాట ప్రకారం ఇక్కడికి వచ్చానని తెలిపారు. నియోజకవర్గంపై వైఎస్సార్ సీపీ పతాకం ఎగురవేయడమే లక్ష్యంగా అందరి ఆశీస్సులతో కృషి చేస్తానని వెల్లడించారు. గతంలో పెదకూరపాడు నియోజకవర్గ సమన్వయకర్తగా మూడున్నర సంవత్సరాలు వ్యవహరించానని గుర్తు చేశారు. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంతో మంది బడా పారిశ్రామికవేత్తలు, నాయకులు గుంటూరు నగర మేయర్ పదవి కోసం ప్రయత్నించారని చెప్పారు. అయినా జగనన్న ఇచ్చిన మాట ప్రకారం తనకు పదవి కట్టబెట్టారని కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్త స్థాయి నుంచి ఎదిగిన తనకు వారి కష్టాలు తెలుసనని, వారికి ఎలా గౌరవించుకోవాలో కూడా తనకు తెలుసునని, కార్యకర్తల ఆకాంక్ష మేరకు పని చేస్తానని పేర్కొన్నారు.

రేపటి నుంచి 'పది' మూల్యాంకనం

- హాజరుకానున్న 1,100 మంది ఉపాధ్యాయులు
- 1,88,924 జవాబు పత్రాల మూల్యాంకన లక్ష్యం

నరసరావుపేట ఈస్ట్: పదవ తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకన(స్పాట్ వాల్యూయేషన్)కు జిల్లా విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 27వ తేదీతో జనరల్, 30వ తేదీతో ఒకేషనల్ విద్యార్థుల పరీక్షలు ముగిశాయి. దీంతో ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి పదవ తరగతి జవాబు పత్రాల మూల్యాంకనకు అధికారులు ఏర్పాట్లు చేశారు. గత ఏడాది నిర్వహించిన ప్రకాష్‌నగర్‌లోని సెయింట్ ఆన్స్ పాఠశాలలోనే ఈ ఏడాది మూల్యాంకన జరిపేందుకు నిర్ణయించారు. దాదాపు 1,100 మంది ఉపాధ్యాయులు హాజరు కానున్న నేపథ్యంలో పాఠశాలలో మౌలిక వసతుల కల్పించారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఫ్యాన్లు తదితర ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది దాదాపు 1,88,924 జవాబు పత్రాలను మూల్యాంకనం చేయనున్నారు. వీటిలో 600 ఒకేషనల్ విద్యార్థుల పేపర్లు ఉన్నాయి. సబ్జెక్ట్‌ల వారీగా అత్యధికంగా గణితం 33,880 పేపర్లు, బయలాజికల్ సైన్స్ 29,990, ఫిజికల్ సైన్స్ 28,551, ఇంగ్లిష్ 28,363, సాంఘిక శాస్త్రం 11,873 జవాబు పత్రాలను మూల్యాంకనం చేయనున్నారు. సబ్జెక్ట్‌ల వారీగా 113 బోర్డుల్ని ఏర్పాటు చేశారు. అందుకు అనుగుణంగా చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లతో పాటు స్పెషల్ అసిస్టెంట్ (స్క్రూటినైజర్లు)లను నియమించారు. ఈమేరకు ఉపాధ్యాయులకు స్పాట్ వాల్యూయేషన్ ఆర్డర్లను కూడా పంపించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు శనివారం కేంద్రాన్ని పరిశీలించారు. సబ్జెక్ట్‌ల వారీగా బోర్డుల ఏర్పాటు, వారికి గదుల కేటాయింపు, మౌలిక వసతులు, జవాబు పత్రాలను భద్రపరిచే స్ట్రాంగ్‌రూంను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్పాట్ వాల్యూయేషన్‌కు దాదాపు 1,100 మంది ఉపాధ్యాయులు హాజరు కానున్నారని తెలిపారు. ఇందుకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు.

ఓటుహక్కు వినియోగంతోనే ప్రజాస్వామ్యం మనుగడ



కలెక్టరేట్ నుంచి నిర్వహించిన అవగాహనా ర్యాలీలో జిల్లా కలెక్టర్, అధికారులు

యువత, పట్టణ ఓటర్లకు ఓటుహక్కుపై అవగాహన

నరసరావుపేట: ఓటుహక్కు వినియోగంతోనే ప్రజాస్వామ్యం మనుగడ సాధ్యమని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. ఓటుహక్కు వినియోగం ఆవశ్యకత గురించి పట్టణంలో యువత, ప్రజలకు తెలియజేస్తూ ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో ఓటుహక్కు వినియోగించుకుంటున్న వారి శాతం తక్కువగా ఉంటోందని తెలిపారు. యువత సైతం ఓటు వేసేందుకు ఆసక్తి చూపడం లేదని, వచ్చే సాధారణ ఎన్నికల్లో అందరూ పెద్దఎత్తున ముందుకు వచ్చి ఓటుహక్కు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. నూతనంగా నమోదైన యువత ఓటు విలువ తెలుసుకొని, దాన్ని సక్రమంగా వినియోగించుకోవడం ద్వారా దేశ ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని తెలిపారు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన మనదేశంలో సార్వత్రిక ఎన్నికలు ఒక పెద్ద పండుగ వంటివని, ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అందరి భాగస్వామ్యంతోనే ప్రజాస్వామ్యం పరిపుష్టమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, ట్రైనీ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ, స్వీప్ నోడల్ అధికారి నాగిని, ఐసీడీఎస్ పీడీ ఉమారాణి పాల్గొన్నారు.

దివ్యాంగులకు 'ఫ్రెండ్లీ ఓటింగ్'

రానున్న సార్వత్రిక ఎన్నికలలో దివ్యాంగులు స్నేహపూర్వక వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకునేలా జిల్లాలో అన్ని చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో శనివారం వివిధ శాఖల అధికారులతో దివ్యాంగులు ఓటు హక్కు వినియోగంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో ర్యాంపులు సక్రమంగా ఉండాలని, అవసరమైన చోట దివ్యాంగులకు వీల్ చైర్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఓటర్ హెల్ప్ లైన్ డెస్క్, బ్రెయిలీ బ్యాలెట్ షీట్, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటుతో పాటు సహాయకుడిని ఉంచేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. 85 ఏళ్లు పైబడిన వారికి, దివ్యాంగులకు హోం ఓటింగ్, ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా రూపొందించిన సాక్ష్యం యాప్ వినియోగంపై రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్, బూత్ లెవెల్ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ రూపొందించిన నిబంధనలు దివ్యాంగులకు అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ హుండీ ఆదాయం రూ.1.07 కోట్లు



హుండీల లెక్కింపులో ఈవో రమేష్‌నాయుడు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మవారికి భక్తులు హుండీల ద్వారా రూ.1.07 కోట్ల నగదును కానుకలు, మొక్కుబడిగా సమర్పించారు. అమ్మవారి మండపంలో శనివారం కానుకలను లెక్కించారు. 64 రోజులకు గాను నగదు రూపంలో రూ.1,07,31,211, బంగారం 135 గ్రాములు, వెండి 350 గ్రాములు వచ్చినట్లు ఈవో కె.రమేష్‌నాయుడు తెలిపారు. విదేశీ నగదు యూఎస్ఏ డాలర్లు 9, ఆస్ట్రేలియా 50, సింగపూర్ 30 డాలర్లు వచ్చాయన్నారు. కానుకలను ఆలయ సిబ్బందితో పాటు పరిటాలకు చెందిన శ్రీదుర్గా శివసాయి సేవా సమితి సభ్యులు, గ్రామానికి చెందిన భక్తులు లెక్కించారు. దేవదాయశాఖ అధికారులు పర్యవేక్షించారు.

ఉత్సవాల ద్వారా రూ.50.60 లక్షల ఆదాయం...

చిన్న తిరునాళ్ల మహోత్సవాల ద్వారా ఆలయానికి రూ.50,60,405 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.20,10,375, సేవల ద్వారా రూ.2,87,700, దర్శనాల ద్వారా రూ.8,46,350, కేశఖండనశాల టికెట్స్ ద్వారా రూ.2,87,480, తాత్కాలిక షాప్‌ల అద్దె ద్వారా రూ.16,21,000, డొనేషన్స్ ద్వారా రూ.7,500 వచ్చాయన్నారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సహకారంతో ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయని తెలిపారు.

నోటా... వాటా గణనీయం

- ఏటేటా పెరుగుతున్న అభ్యర్థుల తిరస్కరణ ఓటు
- 2014 సార్వత్రిక ఎన్నికల్లో నోటాకు వచ్చిన ఓట్లు 4,295
- 2019లో ఎన్నికల్లో రెట్టింపు దాటిన ఓట్లు 10,475
- జిల్లాలో కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులకు నోటా కంటే తక్కువ నమోదు
- అభ్యర్థులను భయపెడుతున్న నోటా బటన్



సత్తెనపల్లి/దాచేపల్లి : నోటా .. ఈ పదం ఎక్కువగా ఎన్నికల సమయంలో వినపడుతూ ఉంటుంది. ఈవీఎం మిషన్లపై చివరగా ఉండే ఈ నోటా గురించి నిరక్షరాస్యులకు తెలియక పోవచ్చేమో గానీ అక్షరాస్యులకు మాత్రం దాదాపుగా అందరికీ గుర్తుంటుంది. అయితే, ఈ గుర్తు ఎవరికీ సంబంధించింది కాకపోయినా ఎన్నికల కమిషన్ ఓటు వేయడంలో దీనికి చోటు కల్పించింది. పార్టీలకు సంబంధించి నచ్చని అభ్యర్థులు చాలామంది ఓటు వేయకుండా మిన్నకుండి పోతున్నారు. ఇలాంటి వారు సైతం ఓటు హక్కును వినియోగించు కోవడంతో పాటు తమకు ఏ పార్టీ అభ్యర్థి నచ్చలేదని చెప్పడానికి వీలవుతుంది. ఈ క్రమంలో ఈవీఎంలపై ఉన్న నోటా బటన్‌ను నొక్కవచ్చు. దీన్ని ప్రవేశపెట్టిన నాటి నుంచి ఇప్పటి వరకు ప్రతి ఎన్నికల్లో నొక్కే వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది.

నోటా అంటే?

నోటా(నన్ ఆఫ్ ది అబో) అంటే .. పైన నిలబడిన వ్యక్తుల్లో ఎవరూ కాదు అని అర్థం. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులలో ఎవరూ నచ్చలేదని చెప్పేందుకు ఎన్నికల సంఘం దీన్ని తీసుకొచ్చింది. పోలింగ్ శాతం పెంచడంతో పాటు ఓటర్లు తమ అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పే అవకాశం కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశం. 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చాలామంది నోటాను ఎంచుకున్నారు. నోటా ప్రభావం జిల్లాలో ఎక్కువగానే ఉంది. ఎన్నికలు జరిగిన ప్రతిసారి నోటాకు పడుతున్న ఓట్ల సంఖ్య పెరుగుతుండడం గమనార్హం. ఎంతలా అంటే పలుచోట్ల అభ్యర్థుల తలరాతను మార్చే అంతలా ఉంది. బరిలో నిలిచిన అభ్యర్థుల్లో కొందరి కంటే నోటాకే ఓట్లు ఎక్కువగా పడ్డాయంటే అర్థం చేసుకోవచ్చు.

పెరుగుతున్న ఆదరణ

2014 ఎన్నికల నుంచి నోటాకు ఆదరణ పెరుగుతూ వస్తోంది. బరిలో ఉన్న అభ్యర్థులు ఎవరు నచ్చకపోతే ఓటర్లు నోటా బటన్ నొక్కేస్తున్నారు. 2014లో తొలిసారిగా నోటాను బ్యాలెట్ షీట్‌లో చేర్చారు. ఈ ఎన్నికల్లో పల్నాడు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నోటాకు 4,295 ఓట్లు పోలైతే ... 2019లో 10,475 పోలయ్యాయి. 2014లో మొత్తం ఏడు నియోజకవర్గాల నుంచి 97 మంది అభ్యర్థులు బరిలో నిలిస్తే 56 మందికి నోటా కంటే తక్కువ ఓట్లు రావడం విశేషం. కొన్ని నియోజకవర్గాల్లో జాతీయ పార్టీల అభ్యర్థుల కంటే నోటాకే ఎక్కువ ఓట్లు పోలైన పరిస్థితి కనిపిస్తోంది. 2014లో జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 100 మంది అభ్యర్థులు పోటీ చేయగా 73 మంది అభ్యర్థుల కంటే నోటాకు ఎక్కువ ఓట్లు పోలయ్యాయి. 2014లో అత్యధికంగా మాచర్ల నియోజకవర్గంలో 915 ఓట్లు నోటాకు పడితే, అత్యల్పంగా చిలకలూరిపేట నియోజకవర్గంలో 438 ఓట్లు నోటాకు పోలయ్యాయి. 2019లో అత్యధికంగా గురజాల నియోజకవర్గంలో 2,062 ఓట్లు నోటాకు పడితే అత్యల్పంగా చిలకలూరిపేట నియోజకవర్గంలో 897 ఓట్లు నోటాకు పోలయ్యాయి.

గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో నోటాకు పోలైన ఓట్లు

నియోజకవర్గం	2014	2019
పెదకూరపాడు	600	1,397
చిలకలూరిపేట	438	897
నరసరావుపేట	613	1,019
సత్తెనపల్లి	594	1,244
వినుకొండ	656	1,942
గురజాల	479	2,062
మాచర్ల	915	1,914
మొత్తం	4,295	10,475

వలంటీర్లపై విషం కక్కిన విపక్షం

శాసనమండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న విప్ లేళ్ల అప్పిరెడ్డి

పట్నంబజారు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఓడించడం ఎవరి తరమూ కాదని విపక్షాలకు తెలిసిపోయిందని శాసనమండలి విప్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. అందుకే ప్రజలను ఇబ్బంది పెట్టే కార్యక్రమాలు చేపడుతున్నారని, అందులో భాగంగానే వలంటీర్లు పింఛన్ ఇవ్వడానికి వీల్లేదంటూ పదే పదే ఇటు కోర్టులో అటు ఎలక్షన్ కమిషన్‌కు పిటీషన్లు పెట్టారని విమర్శించారు. బృందావన్‌గార్డెన్స్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులను ఇక్కట్లకు గురిచేసే ఈ విపరీత పోకడలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారనీ.. రానున్న ఎన్నికల్లో వారి డిపాజిట్లు గల్లంతు చేసే రీతిలో ఓడించి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సమాజ సేవ చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చిన సేవకులు వలంటీర్లని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా వలంటీర్లు కరోనా సమయంలో అందించిన సేవలు అందరికీ తెలిసిందేనన్నారు. గతంలో అభివృద్ధి సంక్షేమ ఫలాలు పొందాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణం చేయాల్సి వచ్చేదని, కేవలం పచ్చ చొక్కా ధరించిన వారికి లేదా ఇంటిపై పచ్చ జెండా ఎగరేసిన వారికి మాత్రమే లబ్ధి చేకూరేదని ఆరోపించారు. వలంటీర్ వ్యవస్థ ఏర్పడిన తర్వాత ప్రజలకు ఆ ఇబ్బంది తొలగిపోయిందని చెప్పారు. ఈ నేపథ్యంలోనే చంద్రబాబు ఏజెంట్ కుహనా మేధావి ముసుగులో ఎలక్షన్ కమిషన్‌కి పిటీషన్ పెట్టి వలంటీర్లు పింఛన్ ఇవ్వకుండా చేశారన్నారు. దీని వలన ఎవరికి నష్టమో ప్రజలు ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. విజ్ఞులైన ప్రజలతో పాటు ప్రజాస్వామ్యవాదులు సైతం ఆలోచన చేయాలనీ.. దీనిపై నిరసన గళం విప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓర్సు శ్రీనివాసరావు, దళిత మేధావి ముత్యం, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, షేక్ రబ్బాని తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు దళితులు, పేదలంటే చిన్నచూపు

గుంటూరు రూరల్: చంద్రబాబుకు మొదటినుంచి దళితులన్నా, పేదలన్నా చిన్నచూపని వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆవుల సుందర్ రెడ్డి తెలిపారు. పెదపలకలూరులో శనివారం మాట్లాడుతూ ఇటీవల ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు ఎంఏ, బీఈడీ చదివి కుటుంబ పోషణ కోసం టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న వీరాంజనేయుల నీతి నిజాయతీ, కష్టపడే తత్వం, సేవా తత్పరతను మెచ్చి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థిగా నియమించారన్నారు. అటువంటి వీరాంజనేయులను కించపరుస్తూ ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు మాట్లాడటం సిగ్గుచేటని ఖండించారు. చంద్రబాబుకు నీతిగా నిజాయితీగా ఉండే పేదలంటే నచ్చదని, అందుకే రానున్న ఎన్నికల్లో కార్మికులంతా బుద్ధి చెప్పాలన్నారు.

మోసానికి రోల్ మోడల్ చంద్రబాబు



చింతలతండాలో పార్టీలో చేరిన వారితో విప్ పీఆర్కే



కారెంపూడిలో పార్టీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ పీఆర్కే

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

విజయపురి సౌత్: మోసానికి రోల్ మోడల్ చంద్రబాబు అని ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి విమర్శించారు. మాచర్ల మండలం చింతలతండా గ్రామానికి చెందిన పలు కుటుంబాలు శనివారం టీడీపీ నుంచి ప్రభుత్వ విప్ పీఆర్కే సమక్షంలో మాచర్ల పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. ఈ సందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ ప్రతి సామాజిక వర్గానికి రాజకీయంగా సముచిత స్థానం కల్పించానని తెలిపారు. జగనన్న సారథ్యంలో రాష్ట్రంలో సుభిక్ష పాలన కొనసాగుతోందని చెప్పారు. రాబోయే ఎన్నికలలో 175కు 175 అసెంబ్లీ సీట్లు రావటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం కె. హాము, కె. సోమని, కె. రవి తదితరులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో చింతలతండా ఉప సర్పంచ్ కేతావత్ లచ్చు, సభావత్ సీతానాయక్, కె. మాణిక్‌నాయక్ పాల్గొన్నారు.

కారెంపూడిలో..

కారెంపూడి శివారు ఆదినారాయణ కాలనీకి చెందిన పది యానాది కుటుంబాలు టీడీపీ నుంచి శనివారం వైఎస్సార్ సీపీలో చేరాయి. వారందరికీ ప్రభుత్వ విప్, మాచర్ల శాసన సభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీని నమ్ముకుని పని చేసిన వారికి తగిన గుర్తింపు తప్పకుండా ఉంటుందని, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు షేక్ షఫీ, పార్టీ మండల నాయకులు బొమ్మిన అల్లయ్య, కొమ్ము చంద్రశేఖర్, యానాది సంఘ నాయకులు పొన్నలూరి సుభాని, కొమరగిరి కృపాదానం, హరిబాబు, ప్రభాకర్ పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



కార్యకర్తలను వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి:నగర పంచాయతీలోని పలు వార్డుల్లో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 30 కుటుంబాలు శనివారం ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. నగర పంచాయతీ చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కొప్పుల సాంబయ్య ఆధ్వర్యంలో టీడీపీ, జనసేనకి చెందిన నాయకులు కొప్పుల నాగేశ్వరరావు, కొప్పుల సత్యం, రంగిశెట్టి నాగేశ్వరరావు, మద్దికాయల అప్పారావు, మద్దికాయల హనుమంతరావు, జాలె సైదులు, జాలె కొండ, గుండ్రెడ్డి శ్రీనుబాబు, గుండ్రెడ్డి హనుమంతరావు, కేసరి కొండలు, జాలె గోపి, మాదినేటి సుబ్బారావు, మునగా సత్యం, గొర్రెపాటి నరసింహ, చిగురుపాటి గోపి, గుండ్రెడ్డి వెంకట్రావ్, సాకేటి ఆదినారాయణ, బొరడి గోవిందు, నాగిరి అజయ్‌కుమార్, ఎలిశెట్టి పిచ్చయ్య తదితరులకు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు , ఎమ్మెల్యే కాసు పనితీరు నచ్చటంతో పార్టీలో చేరినట్లు నాయకులు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ టి.జి.వి.కృష్ణారెడ్డి, నాయకులు కుందురు తిరుపతిరెడ్డి, కొప్పుల రవికుమార్, కొప్పుల కృష్ణ, అంబటి ఆంజనేయులు, యర్రంశెట్టి సైదారావు, గండ్రికల సైదారావు, బుర్రి అనిల్, మునగా శ్రీనివాసరావు, మునగా వెంకీ, స్వామి పాల్గొన్నారు.

కొత్తపల్లిలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు



కొత్తపల్లిలో వైఎస్సార్ సీపీలో చేరిన కుటుంబాల వారితో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: మండలంలోని కొత్తపల్లిలో టీడీపీకి చెందిన 11 కుటుంబాలు శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. ఆయన వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్‌మోహనరెడ్డి ముఖ్యమంత్రి అయితేనే ప్రస్తుతం అందుతున్న సంక్షేమ పథకాలన్నీ కొనసాగుతుయాన్న విషయాన్ని అందరూ గుర్తు పెట్టుకోవాలని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో కట్టికోట శ్రీనివాసరావు, లక్ష్మీపతి, సాంబశివరావు, గురజాల శ్రీనివాసరావు, రామాంజనేయులు, సైదయ్య, మందపాటి వెంకటనరసింహారావు, నడింపల్లి వెంకటేశ్వరరావు, కనుమూరి రేవతి, మోదుగుల సీతయ్య, షెక్ హుస్సేన్ ఉన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మార్కపూడి దేవదానం , మార్కెట్ యార్డు డైరెక్టర్ మేకల శ్రీనివాసరావు, సచివాలయాల కన్వీనర్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

■ మండలంలోని వేల్పూరులో టీడీపీ ప్రముఖ నేత పొన్నెకంటి వెంకటేశ్వరరావు శనివారం తన అనుచరులతో వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన బయ్యవరం టీడీపీ కార్యకర్తలు




బయ్యవరంలో ఎమ్మెల్యే శంకరరావు సమక్షంలో పార్టీలో చేరుతున్న టీడీపీ నేతలు



వేల్పూరులో టీడీపీ నేత వెంకటేశ్వరరావును ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

బయ్యవరం(క్రోసూరు): మండలంలోని బయ్యవరంలో టీడీపీకి చెందిన ఎనిమిది కుటుంబాలు శనివారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పెదకూరపాడు నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్ సీపీ జెండా ఎగరేందుకు అందరూ కలిసి కృషి చేయాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో బెల్లంకొండ శీను,రవి, రాంబాబు, పోపూరి రామయ్య, బోడిపురి యాకోబు, పండు, తేజ, శ్రీను ఉన్నారు.

జాతీయ చిత్రలేఖనం పోటీల్లో టీచర్‌కు ప్రథమ స్థానం



జాతీయ స్థాయిలో మొదటి స్థానం సాధించిన ఆర్ట్

జే పంగులూరు: జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో ఉపాధ్యాయుడు సత్తా చాటారు. విజయవాడలో స్ఫూర్తి క్రియేటివ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన జాతీయస్థాయిలో డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. పోటీలు పర్యావరణ పరిరక్షణలో భాగంగా 'పిచ్చుకను రక్షించుకుందాం' నినాదంతో పోటీలు నిర్వహించగా పోటీలకు జాతీయస్థాయిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, కేరళ, ఒడిశా, జార్ఖండ్ తదితర రాష్ట్రాల నుంచి కళాకారులు పాల్గొన్నారు. డ్రాయింగ్ ప్రదర్శనలో 370 చిత్రాలు ఈ పోటీల్లో ప్రదర్శనలో ఉంచారు. వీటిలో మండలంలోని ముప్పవరానికి చెందిన డ్రాయింగ్ మాస్టార్(యజ్ఞ ఆర్ట్స్ అకాడమీ) తిరుమల శెట్టి వెంకటేశ్వర్లు గీసిన బొమ్మ మొదటి స్థానం గెలుచుకుంది. ప్రస్తుతం డ్రాయింగ్ మాస్టార్ వెంకటేశ్వర్లు కొండమంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ టీచర్‌గా పనిచేస్తున్నారు. జాతీయస్థాయిలో ఘనత సాధించిన డ్రాయింగ్ మాస్టార్‌కు పాఠశాల హెచ్‌ఎం అనిత అభినందించారు.



తిరుమలశెట్టి వెంకటేశ్వర్లు

వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నియామకం

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సత్తెనపల్లి పురపాలక మహిళా విభాగ కమిటీని కేంద్ర పార్టీ కార్యాలయం శనివారం విడుదల చేసింది. అధ్యక్షురాలిగా పి.గీతా హసంతి, ఉపాధ్యక్షులుగా వి.పద్మావతి, ఎం.మంగమ్మ, ప్రధాన కార్యదర్శులుగా ఎల్.కల్యాణి, షేక్ హుస్సేన్‌బీ, వై.లక్ష్మి, ఎస్.ఇన్నమ్మ, కార్యదర్శులుగా బి.సామ్రాజ్యం, షేక్ సిలార్‌బీ, సయ్యద్ మాబుర్ల, బి.శారదావాణి, ఎస్.వెంకాయమ్మ, బి.కామేశ్వరి, పి.అమృతావాణి, సంయుక్త కార్యదర్శులుగా ఏ.ఇన్నమ్మ, ఎం.యశోదాదుర్గ, పి.ప్రశాంతి, సీహెచ్.అరుణ, షేక్ మీరాబీ నియమితులయ్యారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య



బల్లికురవ: మద్యానికి బానిసైన ఓ యువకుడు మద్యంలో ఎలుకల మందు కలుపుకుని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 30 గంటలు మృత్యువుతో పోరాడి శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. బల్లికురవ పోలీసు స్టేషన్ ఏఎస్‌ఐ బండి శ్రీనివాసరావు అందించిన వివరాలు.. మండలంలోని కొణిదెన గ్రామానికి చెందిన తన్నీరు వేణుబాబు(25)కు భార్య జ్యోతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పని చేయడం లేదని ఇటీవల తండ్రి హనుమంతరావు మందలించాడు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యంలో ఎలుకల మందు కలుపుకుని తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు మొదట చిలకలూరిపేట వైద్యశాలకు అక్కడ నుంచి గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి చనిపోయాడు. తండ్రి హనుమంతరావు ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

ఇరువర్గాలపై కేసు నమోదు



మున్నంగి(కొల్లిపర): మండలంలోని మున్నంగి గ్రామ సమీపంలో కృష్ణా నది ఇసుక రీచ్ వద్ద అదే గ్రామం ఎస్సీ వర్గానికి చెందిన ఇరువర్గాలు ఒకరిపై దాడులు చేసుకున్న సంఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వేమూరి బాలరాజు, వేమూరి అశోక్, వేమూరి రాజేష్ తదితరులు ఇసుక తీయటం వల్ల భూగర్భజలాలు అడుగంటుతున్నాయనీ, తవ్వకాలు ఆపాలని ఇసుక తరలిస్తున్న లారీలు, ట్రాక్టర్లులను ఆపారు. దీంతో రీచ్ వద్ద పనులు చేస్తున్న అదే గ్రామానికి చెందిన వేమూరి మోషే, వేమూరి చింతయ్య, వేమూరి అంజిలులారీలు ఆపవద్దు అంటూ వచ్చిన వారిపై దాడికి దిగారు. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు కత్తులు, రాడ్లులు, ట్రాకర్లతో దాడులు చేసుకున్నారు. ఇరువర్గాలు గాయపడ్డారు. దాడిలో వేమూరి బాలరాజు తీవ్రంగా గాయపడగా, వైద్యశాలకు తరలించారు. ఎస్‌ఐ ఆర్.రవీంద్రరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ బోల్తా పడి డ్రైవర్ మృతి

బల్లికురవ: లారీ అదుపుతప్పి పంట కాలువలో బోల్తా పడిన ఘటన శుక్రవారం రాత్రి నార్కెట్-మేదరమెట్ల నామ్ రహదారిలోని మండలంలోని వైదన గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. వివరాలు.. దుస్తుల లోడుతో లారీ వరంగల్లు నుంచి చిత్తూరు బయలుదేరింది. గ్రామ సమీపంలోకి వచ్చే సరికి అదుపుతప్పి బోల్తాకొట్టి పంట కాలువలోకి దూసుకెళ్లింది. దీంతో డ్రైవర్ గుర్రాల సురేష్(24) అక్కడిక్కడే చనిపోయాడు. క్లీన్ పూర్ణ చంద్రరావుకు గాయాలయ్యాయి. సురేష్‌ది తెలంగాణ రాష్ట్రం హనుమకొండ జిల్లా మల్లాపల్లె గ్రామం. క్లీనర్ ఫిర్యాదు మేరకు బల్లికురవ పోలీసు స్టేషన్ ఏఎస్‌ఐ బాలకృష్ణ కేసు నమోదు చేశారు. సురేష్ భౌతిక కాయాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట వైద్యశాలకు తరలించారు.

ఆటోను ఢీకొట్టిన బైకు

బల్లికురవ: ఆగిఉన్న ఆటోను బైకు ఢీకొట్టడంతో తండ్రి, కుమార్తె గాయపడిన ఘటన శనివారం మేదరమెట్ల-నార్కెట్‌పల్లి నామ్ రహదారిలోని మండలంలోని రామాంజనేయపురం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. పంగులూరు మండలం కోటపాడు గ్రామానికి చెందిన శోంఠి వీరాంజనేయులు కుటుంబ సభ్యులతో కలిసి అత్తగారి ఊరైన పల్నాడు జిల్లా ఈపూరు మండలం బొల్లాపల్లి వెళ్తున్నాడు. గ్రామ సమీపంలో ఆగిఉన్న ఆటోను బైకుపై వెళుతున్న వీరాంజనేయులు ఢీకొట్టటంతో అతడితో పాటు కుమార్తె నవ్యకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న వలంటీర్ రమేష్‌బాబు బాధితులకు ఊరిలో ప్రథమ చికిత్స చేయించాడు. అనంతరం హైవే అంబులెన్స్‌లో ఉన్నత చికిత్స కోసం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

తనిఖీల్లో రూ. కోటికి పైగా స్వాధీనం

గుంటూరు వెస్ట్: జిల్లాలో ఇప్పటి వరకూ ఫ్లయింగ్ స్క్వాడ్‌లు రూ. 1.30 కోట్ల విలువైన నగదు, మద్యం ఇతర వస్తువులను సీజ్ చేశారని కలెక్టర్ కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. గుంటూరు వెస్ట్ నియోజకవర్గంలో రూ. 2.44 లక్షలు, ప్రత్తిపాడు నియోజకవర్గంలో రూ. లక్షకు పైగా నగదుకు సరైన ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేశామని పేర్కొన్నారు.